
తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 01 శుక్రవారం 08 - 05 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

# మోత్కూరు చేనేత సహకార సంఘంలో..

# మోనార్క్




ప్రజావారధి/మోత్కూరు

యాదాద్రి జిల్లా మోత్కూరు చేనేత సహకార సంఘంలో ఓ ఉద్యోగి మోనార్క్‌లా వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేండ్ల కిందట సంఘంలో ఉద్యోగంలో చేరిన అతను నేడు సంఘాన్నే చెరబట్టి చేనేత కార్మికులను పీడిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని కార్మికులు, పద్మశాలి సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. కార్మికులకు ఏ ప్రభుత్వ పథకం అందాలన్నా.. ఏ పథకానికి దరఖాస్తు చేయాలన్నా ఆయన అడిగింది ముట్టజెప్పితే తప్ప ఆ పథకాలు అందే పరిస్థితి లేదని, అడిగింది ఇవ్వకుంటే నోటికొచ్చినట్టు తిట్ల దండకం అందుకుంటాడని వాపోతున్నారు. కుటుంబమంతా కష్టపడి పనిచేస్తే వచ్చే అరకొర డబ్బులతోనే భార్యాపిల్లలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమను డబ్బుల కోసం వేధించడమేమిటని, అడిగిన డబ్బులు ఇవ్వకుంటే ఏ పథకం రాకుండా, ఏ పని చేయకుండా అడ్డుకుంటాడన్న భయంతో కొందరు కార్మికులు ఆయన అడిగిన కాడికి ముట్టజెప్పుతున్నారని చెబుతున్నారు. ధైర్యం చేసి ఎవరైనా ప్రశ్నిస్తే..పై అధికారులకు ఇవ్వొద్దా..ఊరకనే ప్రభుత్వ పథకాలు వస్తాయా..పనులు జరుగుతాయా అని దబాయిస్తాడంటున్నారు. పద్మశాలి సంఘం నాయకులు సైతం ఇటీవల ప్రెస్‌మీట్ పెట్టి మేనేజర్ నర్సయ్యపై తీవ్రమైన ఆరోపణలు చేయడంతో పాటు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## మేనేజర్ నర్సయ్యపై తీవ్ర ఆరోపణలు
## ప్రభుత్వ పథకాలు అందాలంటే..ఓ రేటు కట్టి వసూలు

చేనేత సహకార సంఘంలో మేనేజర్‌గా పనిచేస్తున్న వేముల నర్సయ్య మోనార్క్‌లా వ్యవహరిస్తున్నాడని పద్మశాలి సంఘం నాయకులు, కార్మికులు ఆరోపస్తున్నారు. సుమారు 30 ఏండ్లుగా సంఘంలో పాతుకపోయిన అతను సంఘాన్ని, కొందరు నాయకులను తన గుప్పిట పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని చెబుతున్నారు. ఏ ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందాలన్నా.. పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఓ రేటు కట్టి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. మోత్కూరుకు చెందిన చేనేత కార్మికుడు బండారి జంగయ్య చనిపోగా చేనేత బీమా పథకం కింద ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఆ డబ్బులు ఆ కుటుంబానికి ఇవ్వడానికి మేనేజర్ నర్సయ్య రూ.40 వేలు ఇవ్వాలని కుటుంబ సభ్యులను డిమాండ్ చేశాడు. తమది అసలే నిరుపేద కుటుంబమని, అంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని అతని కాళ్లావేళ్లా పడినా కనికరించకుండా రూ.40 వేలు ఇచ్చేదాకా పీడించాడని, గత్యంతరం లేక ఇవ్వాల్సి వచ్చిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు చేనేత రుణమాఫీ చేయగా మోత్కూరులో 18 మంది కార్మికులకు రుణమాఫీ అయ్యింది. ఆ 18 మందికి చెక్కులు ఇవ్వడానికి అయ్యగారు ఓ రేట్ ఫిక్స్ చేసి రూ.లక్ష మాఫీ అయిన వారు రూ.6 వేలు, రూ.50 వేలు మాఫీ అయిన వారు రూ.3 వేలు సమర్పించాలని రేటు ఫిక్స్ చేశారు. ఎందుకు ఇవ్వాలని అడిగితే పై అధికారులకు ఇవ్వొద్దా..ఊరికే చెక్కులు ఇస్తారా అంటూ వారి నుంచి ముక్కు పిండి వసూలు చేశాడు. కొందరు నేరుగా డబ్బులు ఇవ్వగా, మరికొందరు ఫోన్‌పే, గూగుల్ పేలో సమర్పించారు. మగ్గాల జియో ట్యాగింగ్ కోసం ఒక్కో కార్మికుని నుంచి రూ.2 వేల నుంచి 3 వేల వరకు వసూలు చేశాడని, త్రిఫ్ట్ పథకంలో దరఖాస్తు చేయడానికి కూడా కార్మికుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేశాడని ఆరోపిస్తున్నారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికులు, అనుబంధ కార్మికులుగా అర్హత ఉన్నవారిని కాకుండా అర్హత లేని హైదరాబాద్‌లో ఉంటున్న వారి పేర్లు నమోదు చేశారని, స్థానికంగా పని చేస్తున్న కార్మికులకు తెలియకుండానే హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్న, చదువుకుంటున్న వ్యక్తులను వారికింద అనుబంధ కార్మికులుగా చేర్చారని చెబుతున్నారు.

- సంఘాన్ని చెరబట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం
- చేనేత కార్మికులు చేయి తడపందే ఏ పని అవ్వదు
- ప్రభుత్వ పథకాలు అందాలంటే..ఓ రేటు కట్టి వసూలు
- కార్మికులను పీడించి వసూలు..ఇవ్వకుంటే తిట్ల దండకమే
- సంఘానికి కోట్లలో ఆస్తులు..నెలనెలా లక్షల్లో ఆదాయం
- లావాదేవీలన్నీ బ్రహ్మరహస్యమే..అడిగితే నోరెస్పాన్స్
- కొత్తవాళ్లకు, వారసులకు సభ్యత్వం ఇవ్వరు
- మేనేజర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కార్మికులు, నాయకుల డిమాండ్

## సంఘానికి కోట్లలో ఆస్తులు..నెలనెలా లక్షల్లో ఆదాయం
## లావాదేవీలన్నీ బ్రహ్మరహస్యమే..అడిగితే నోరెస్పాన్స్

మోత్కూరు చేనేత సహకార సంఘం 1952లో ఏర్పడగా ప్రస్తుతం సంఘంలో 215 మందికి సభ్యత్వం ఉంది. సంఘంలో మేనేజర్ నర్సయ్యతో పాటు మరొకరు కలిపి ఇద్దరు ఉద్యోగులు పని




సంఘం భవనంలో నిర్వహిస్తున్న వైన్స్, సిట్టింగ్ రూం (భవనం పైన సెల్ టవర్)

చేస్తున్నారు. సంఘానికి మోత్కూరు మున్సిపాలిటీలో రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. భువనగిరి మెయిన్ రోడ్డులో అర ఎకరం స్థలంలో మినీ ఫంక్షన్ హాల్, 8 షట్టర్లు, చెరువు కట్ట చౌరస్తా వద్ద ఓ పెద్ద భవనం ఉంది. మినీ ఫంక్షన్ హాల్‌ను ఓ వ్యక్తికి లీజుకు ఇవ్వగా, మెయిన్ రోడ్డు వెంట ఉన్న 8 షట్టర్లను కిరాయిలకు ఇచ్చారు. చెరువు కట్ట వద్ద భవనాన్ని వైన్‌షాపు, సిట్టింగ్‌రూంకు అద్దెకు ఇచ్చారు. భవనంపైన కొన్నేండ్ల కిందట ఓ సెల్ కంపెనీ టవర్ ఏర్పాటు చేసింది. వీటన్నింటి నుంచి కిరాయిల రూపంలో నెలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా ఆ లావాదేవీలన్నీ బ్రహ్మరహస్య మేనని చేనేత నాయకులు ఆరోపిస్తున్నారు. దేని నుంచి నెలకు ఎంత కిరాయి వస్తుంది..అడ్వాన్స్ ఎంత ఇచ్చింది మేనేజర్ నర్సయ్యకు తప్ప ఏ కార్మికునికి తెలియదంటున్నారు. అడిగినా నీకేం అవసరమంటూ చెప్పరు. వాస్తవంగా వస్తుంది ఎంత..సంఘంలో జమ చేస్తుంది ఎంత అన్నది ఏ దేవునికే ఎరుక అని కార్మికులంటున్నారు. సంఘం మినీ ఫంక్షన్ హాల్‌ను గతంలో ఏడాదికి రూ.3 లక్షలకు పైగా లీజుకు ఇవ్వగా, కార్మికుల సమక్షంలో



కిరాయిలకు ఇచ్చిన సంఘం షట్టర్లు

బహిరంగ వేలం ద్వారా లీజుకు ఇవ్వకుండా మేనేజర్ నర్సయ్య ఎవరికి చెప్పకుండా ఏకపక్ష నిర్ణయంతో రూ.2 లక్షలకే లీజుకు ఇచ్చాడని ఆరోపిస్తున్నారు. మేనేజర్ నర్సయ్య ఏండ్లుగా ఇక్కడే తిష్ట వేయడంతో సంఘంపై పూర్తి పట్టు సాధించాడని, పాలకవర్గాలు ఉన్న సమయంలో వారిని మేనేజ్ చేసేవాడని, సుమారు ఏడెనిమిదేండ్లుగా సంఘానికి పాలకవర్గం లేకపోవడంతో సంఘాన్ని పూర్తిగా చెరబట్టి సంఘం లెక్కలు, లావాదేవీలేవీ చెప్పడం లేదని, కార్మికుల కోసం ఏర్పాటు చేసుకున్న సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు రహస్యంగా ఉంచడమేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. మేనేజర్ నర్సయ్య సంఘంలో అక్రమాలకు పాల్పడి ఇండ్లు, ప్లాట్లు కొన్నాడని, రూ.కోట్లలో సంపాదించాడని, తక్కువ వేతనంతో పనిచేస్తున్న అతనికి కోట్లలో ఆస్తులు ఎక్కడివని కార్మికులు, పద్మశాలి సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. మేనేజర్ నర్సయ్య వసూళ్లు, అవినీతి, అక్రమాలు, సంఘం లావాదేవీలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో బహిరంగ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, సంఘాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కార్మికులు, పద్మశాలి సంఘం నాయకులు కోరుతున్నారు.

## కొత్తవాళ్లకు, వారసులకు సభ్యత్వం ఇవ్వరు

చేనేత సహకార సంఘంలో కొన్నేండ్లుగా కొత్తవారికి సభ్యత్వాలు ఇవ్వడం లేదంటున్నారు. సంఘం పరిధిలో సుమారు 400 చేనేత కుటుంబాలు ఉండగా ప్రస్తుతం సంఘంలో 215 మందికి మాత్రమే సభ్యత్వం ఉంది. మేనేజర్ నర్సయ్య, కొందరు నాయకులు కావాలనే కొత్తవారికి సభ్యత్వాలు ఇవ్వడం లేదని, తాము చెప్పినట్టు వినే వారికి, తమ కుటుంబ సభ్యులకు, తమ అనుయాయులకు మాత్రమే సభ్యత్వాలు ఇచ్చారని, కొత్తవారికి ఇస్తే తమ ఆటలు సాగవని, ఎన్నికల్లో ఓట్లు వేయరన్న కారణంతోనే సభ్యత్వాలు ఇవ్వడం లేదని పద్మశాలి సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. చివరకు మోత్కూరు చేనేత సహకార సంఘాన్ని స్థాపించిన వ్యవస్థాపకుల వారసులకు కూడా సభ్యత్వం ఇవ్వడం లేదని, పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సంఘంలో కొత్తవారికి, వారసులకు సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం
### -అన్నదేవర శ్రీనివాస్, చేనేత, జౌళిశాఖ ఏడీ యాదాద్రి

మేనేజర్ వేముల నర్సయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై చేనేత, జౌళిశాఖ యాదాద్రి ఏడీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా కార్మికుల నుంచి డబ్బుల వసూలు చేసిన విషయం మాదృష్టికి రాలేదు. అలాంటిదేమైనా ఉంటే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం. కార్మికులు ఏ పని కోసమైన ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని, మాకు ఫిర్యాదు చేయాలని చెబుతున్నాం. డబ్బులు అడిగిన వారిపై, వసూలు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయిస్తాం.

2లో

# మోత్కూరు చేనేత సహకార సంఘంలో మోనార్క్

## తానంటే గిట్టకనే ఆరోపణలు

### -వేముల నర్సయ్య, మేనేజర్

తానంటే గిట్టని వారు కొందరు అసత్యమైన ఆరోపణలు చేస్తున్నారు. సంఘంలో నాది 30 ఏళ్ల సర్వీస్. 300 మందిలో ముగ్గురు ఆరోపణలు చేస్తే నేనేం చేసేది లేదు. నేను దోచుకతింటున్న అని 300 మంది ఆరోపణలు చేయాలి. త్రిఫ్ట్ ఫండ్ కట్టడం కోసం కొందరు తన వద్ద డబ్బులు తీసుకుని కట్టి తిరిగి నాకు ఫోన్ పే కొడతారు. వాటిని చూపి డబ్బులిచ్చాం అంటే ఎలా. చనిపోయిన కార్మికునికి సంబంధించి ఎల్ఐసీ నుంచి వచ్చే బీమా డబ్బు నేరుగా వారి ఖాతాలోనే జమ అవుతుంది. దానికి నేను డబ్బులు ఎలా తీసుకుంటా. సభ్యత్వాలు నేను ఇచ్చేది కాదు. సంఘం లావాదేవీలన్నింటినీ ఆరునెలలకోసారి సభ్యుల ముందు ఉంచుతున్నాం. కార్మికులకు సాయం చేసి, పనులు చేసి నేనెందుకు బద్నాం కావాలి. ఇక నుంచి మాపై అధికారులు చెప్పినట్టే పని చేస్తాం.

## విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

### -పోచం భిక్షపతి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు-మోత్కూరు



సంఘం మేనేజర్ నర్సయ్యపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు బహిరంగ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి. ఏ ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందాలన్నా..దరఖాస్తు చేయాలన్నా డబ్బులు వసూలు చేస్తున్నారు. నిరుపేద చేనేత కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేయడం అన్యాయం. ప్రశ్నించే వారు ఉంటే తమ ఆటలు సాగవని కార్మికులకు కొత్త సభ్యత్వాలు ఇవ్వడం లేదు. సంఘం వ్యవస్థాపకులైన 18 మంది వారసులకు కూడా సభ్యత్వం ఇవ్వడం లేదు.

## మేనేజర్ నర్సయ్యకు రూ.40 వేలు ఇచ్చాం

### -ఓ చేనేత కార్మికుడు

మేనేజర్ నర్సయ్యకు రూ.40 వేలు ఇచ్చామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ చేనేత కార్మికుడు తెలిపారు. మా కుటుంబ సభ్యుడు చనిపోతే చేనేత బీమా కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఆ డబ్బులు వచ్చినందుకు పైఅధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని మేనేజర్ నర్సయ్య రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, అన్ని డబ్బులు ఇవ్వలేమని బతిమిలాడినా వినకుండా ఆ డబ్బులు ఇచ్చేంత వరకు పీడించాడు. అతని మాటలకు తట్టుకోలేక గత్యంతరం లేక రూ.40 వేల నగదు తీసుకెళ్లి అతనికి ఇచ్చాం. అధికారులు విచారణ జరిపితే తాము నిరూపిస్తామన్నారు.